ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

వామ్మో.. ఇలా అయితే కష్టమే! 7

కల ఫలించింది..

ఎస్సీ వర్గీకరణకు వీలుగా సుప్రీం తీర్పు



ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడులో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

- జిల్లావ్యాప్తంగా ఎంఆర్‌పీఎస్ సంబరాలు
- మాదిగ ఉప కులాలకు సమ న్యాయం జరిగిందంటూ హర్షామోదాలు
- 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీం చారిత్రాత్మక తీర్పు



కొయ్యలగూడెంలో సంబరాలు చేసుకుంటున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణకు వీలుగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మాదిగ ఉప కులాలకు సరైన న్యాయం జరిగిందంటూ గురువారం జిల్లావ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. మూడు దశాబ్దాల ఎంఆర్‌పీఎస్ పోరాటం ఫలించిందంటూ పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పలుచోట్ల మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. మాదిగ జాతి చంద్రబాబుకు రుణపడి ఉంటుందంటూ కృతజ్ఞతలు తెలిపారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయాలని డిమాండ్ పుట్టింది మూడు దశాబ్దాల ముందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ వేదికల మీద రాజకీయ పక్షాల ముందు ఎంఆర్‌పీఎస్ పోరాటం సాగుతూనే వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో మాదిగలకు సరైన న్యాయం జరగాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) పుట్టింది. మాదిగ ఉప కులాలకు వర్తించే విధంగా రిజర్వేషన్లు అమలు కావాలన్నదే వారి ఆకాంక్ష. దీనికి తగ్గట్టుగానే అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎంఆర్‌పీఎస్ వాదనలకు తన సమ్మతిని తెలిపారు. అయినా కేంద్రం నుంచి సానుకూలత లేకపోవడంతో అప్పట్లోనే సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం గురువారం నిర్దేశించింది. మాదిగ వర్గీకరణకు వీలుగా రిజర్వేషన్ల అమలు చేయాలంటూ ఎప్పుడో 30 ఏళ్ల క్రితమే ఒక అంశం తెర ముందుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదొక ఉద్యమంగా మారింది. రాయలసీమ జిల్లాల్లోను, తెలంగాణలోను ఉధృతమై మహోగ్రరూపం దాల్చింది. ఎలాగూ రిజర్వేషన్లు అమలవుతున్నాయి కాబట్టి మళ్లీ వర్గీకరణ ఏమిటంటూ అప్పట్లోనే కొందరు వాదనలకు దిగారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావం, దానికి అధినేతగా ఉన్న మంద కృష్ణ మాదిగ ప్రతి రాజకీయ పార్టీని తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆయన నేతృత్వంలోనే అప్పట్లోనే హైదరాబాదు నుంచి ఢిల్లీ వరకు రాజకీయ యాత్రలు సాగాయి. పోరాట స్ఫూర్తిని విస్తరించే క్రమంలో దీక్ష కూడా చేపట్టారు. అప్పట్లోనే ఇదంతా అటు మాదిగల్లోను, ఇటు రాజకీయ పార్టీల్లోను వేడి పుట్టించింది. ఎవరైతే మాదిగ పక్షాన వర్గీకరణకు అనుకూలంతా తమకు మద్దతు ప్రకటిస్తారో తమ మద్దతు వారికే ఉంటుందని ప్రకటించినట్టుగానే ఎంఆర్‌పీఎస్ రాజధాని నుంచి నియోజకవర్గ కేంద్రాలకు, అక్కడి నుంచి మండల స్థాయికి, గ్రామస్థాయి వరకు విస్తరించింది. ఎక్కడికక్కడ కమిటీలు ఏర్పడి ఏబీసీడీ వర్గీకరణకు సరికొత్త ఊపిరి పోశారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి వర్గీకరణే కొన్నాళ్ల పాటు ప్రధాన అంశమైంది. రాష్ట్ర విభజన జరగకముందు ఎంఆర్‌పీఎస్ మద్దతు పొందడానికి వివిధ రాజకీయ పక్షాలు తాపత్రయపడేవి. తగ్గట్టుగానే ఎంఆర్‌పీఎస్ ఉద్యమకారులు సైతం తమ సత్తా చూపిస్తామంటూ అప్పుడూ ఇప్పుడూ శపథం చేస్తూనే వచ్చారు. ఈ మధ్యన జరిగిన తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో సైతం ఎంఆర్‌పీఎస్ పక్షాన మంద కృష్ణ మాదిగను ప్రధాని నరేంద్రమోదీ భుజం తట్టి మరీ సంఘీభావం ప్రకటించారు. మాదిగ వర్గీకరణ విషయంలో తమ పార్టీ పక్షాన తగు విధంగా స్పందిస్తామంటూ ప్రకటించారు. దాంతో మాదిగ వర్గీకరణ పోరాటంలో ఆశలు రెట్టింపు అయ్యాయి. కాని మూడు దశాబ్దాల కాలంలో ఎంఆర్‌పీఎస్ పక్షాన పనిచేస్తున్న అనేక మందిపై కేసులు పెట్టారు. మరికొందరిని జైలులోకి నెట్టారు. అయినా మొక్కవోని ధైర్యంతో వర్గీకరణకు కట్టుబడి ఆ మేరకే పోరాటాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే వరుస సుదీర్ఘ విచారణల తర్వాత సుప్రీంకోర్టు గురువారం అంతిమ తీర్పు ప్రకటించింది. సుప్రీం ధర్మాసనం ఈ మేరకు వర్గీకరణకు సమ్మతిస్తున్నట్టుగా తీర్పు చెప్పింది. దీంతో అన్నిచోట్ల హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందంటూ ఎంఆర్‌పీఎస్ ప్రకటించింది. తాము చేస్తున్న సుదీర్ఘ పోరాటం ఫలించిందని, దీనికి సుప్రీంకోర్టు తుది తీర్పు ఆలంబన అని ప్రకటించింది. తెలుగుదేశం నేతలు సైతం కొన్నిచోట్ల సుప్రీం తీర్పును హర్షిస్తూ కొందరికి స్వీట్లు తినిపించారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు సైతం తాజా తీర్పును స్వాగతించాయి.

ఎక్కడికక్కడ సంబరాలు

ఎస్సీ వర్గీకరణను అమలు చేసేలా సుప్రీంతీర్పును ప్రకటించిన వేళ పల్లెపట్టణం తేడా లేకుండా సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగ వర్గాల్లో కొందరు దీనికి మద్దతుగా వ్యవహరించారు. తాము ఎన్నాళ్ళగానో ఆశించిన విధంగానే ఇప్పటికి ఒక రూపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు కేటాయింపులో రాష్ట్రాల నిర్ణయమే తుది నిర్ణయంగా ప్రకటించడం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికే మాదిగ ఉప కులాలన్నీ ఈ దిశగానే ఎదురు చూస్తున్నాయని, అయితే ప్రస్తుతం ప్రకటించిన ఉద్యోగాల ఖాళీ భర్తీ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సుప్రీం ఇచ్చిన తాజా తీర్పును ఖాళీల భర్తీలో అమలు చేయాలని వివిధ సంఘాలు డిమాండ్ చేశాయి.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ముందు నుంచి టీడీపీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంది. దశాబ్దాల ఎస్సీల పోరాటానికి న్యాయం జరిగింది. వర్గీకరణకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుంది.

- పుట్టా మహేష్ యాదవ్, ఏలూరు ఎంపీ

రిజర్వేషన్ల అమలు సరికొత్త అధ్యాయం



ఎస్సీ ఉప కులాలను వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు కట్టబెడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో దేశంలో రిజర్వేషన్ల అమలు కొత్త పుంతలు తొక్కుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. ఈ తీర్పుతో ఎస్సీలలో రిజర్వేషన్ ఫలాలు అందుకోలేని అత్యంత వెనుకబడిన వర్గాలకు సైతం న్యాయం జరగడంతో పాటు ఎస్సీల్లోని అన్ని ఉపకులాలకు సమాన అవకాశాలు లభించి, అభివృద్ధి దిశగా పయనిస్తారు. ఎస్సీలకు ఉద్యోగాల్లోనూ దామాషా ప్రకారం ఫలాలు అందించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది..

- చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్యే, దెందులూరు

ఉప కులాలకు న్యాయం..



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ఎన్‌డీఏ ప్రభుత్వం రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేరడం, నా హయాంలో ఈ వర్గీకరణ చూడడం, చాలా సంతోషంగా ఉంది. దీనివల్ల విద్య, ఉద్యోగ, అవకాశాల్లో దళిత యువకులకు, ఉప కులాలకు న్యాయం జరుగుతుంది. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఎంతో ఉంది.

- సొంగా రోషన్‌కుమార్, ఎమ్మెల్యే, చింతలపూడి


పూర్తి పాఠం చదివాక స్పందిస్తా..



ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాను చదవలేదని పూర్తిగా చదివిన తర్వాత స్పందిస్తాను. పింఛన్లు పంపిణీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున సుప్రీంకోర్టు తీర్పును చదవలేక పోయాను. వర్గీకరణపై ఖచ్చితంగా నా అభిప్రాయాన్ని చెబుతా.

- చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

ఎస్సీల్లోని 58 ఉపకులాలకు న్యాయం



ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించాలని సుప్రీం కోర్టు తీర్పు హర్షనీయం. ఈ తీర్పుతో ఎస్సీల్లోని 58 ఉపకులాలకు న్యాయం జరుగుతుంది. విద్య, రాజకీయ, ఆర్థికంగా ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందేందుకు ఈ తీర్పు ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభలో ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేసే విధంగా చట్టబద్ధత కల్పిస్తారని ఆశిస్తున్నాం. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు అనుకూలంగా ఉండటం సానుకూల అంశం.

- కందుల రమేష్ , ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు

మూడు దశాబ్దాల పోరాటాలకు న్యాయం



ఎస్సీలోని అన్ని ఉపకులాలకు న్యాయం జరగాలని మాదిగలు చేస్తున్న మూడు దశాబ్దాల శాంతియుత పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అభినందనీయం. సుప్రీం తీర్పుతో ఎస్సీలోని ఉపకులాల కుటుంబాల్లో వెలుగులు వచ్చాయి. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉండడం కలిసొచ్చే అంశం.

- పొలిమేర హరికృష్ణ, ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

(ఏలూరు టూటౌన్/ బుట్టాయగూడెం/పెదవేగి/ చింతలపూడి)

చంద్రబాబు కృషితోనే వర్గీకరణకు మార్గం సుగమం



ఎస్సీ వర్గీకరణ పుణ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిగారిదే. ఆనాడు చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావడం వల్ల నేడు సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమం అయింది. మరలా ఈ వర్గీకరణ తీర్పు సమయంలో ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఉండడం, వర్గీకరణ అమలు జరగడం తథ్యం. ఆనాడు చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయకపోతే వేలాదిమంది మాదిగలకు ఉద్యోగాలు వచ్చేవి కావు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు.

- కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి) మాదిగ, ఎంఆర్‌పీఎస్ నాయకుడు, ముసునూరు

మోదీ, చంద్రబాబులకు కృతజ్ఞతలు



ఎమ్మార్పీఎస్ వర్గీకరణ పోరాటంలో ఎందరో అసువులు బాశారు. మంద కృష్ణ పోరాటం, విశ్వరూప సభలో నరేంద్రమోదీ హామీ, వర్గీకరణ చేయాలనే నిర్ణయం చంద్రబాబు హయాంలో బీజం ఏర్పడి, తిరిగి ఆయన హయాంలోనే సుప్రీం తీర్పు రావడం చరిత్రాత్మకం. వారికి కృతజ్ఞతలు. వర్గీకరణ అమలుతో నష్టపోతున్న వర్గానికి న్యాయం జరిగింది.

- ఎం.ముత్తేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ కన్వీనర్

మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమిది



ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో ఎస్సీ ఉపకులాల్లో ఎంతోమందికి అన్యాయం జరిగింది. దీనిపై మంద కృష్ణ మాదిగ చేసిన 30 ఏళ్ల పోరాటం ఫలితం.. రాజకీయ పార్టీల మద్దతు.. ఈ రోజున సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. రిజర్వేషన్ల అమలులో రాష్ట్రాలకు అధికారం కట్టబెడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలకు న్యాయం జరుగు తుంది.

- యర్రా నాగమల్లేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్

సుప్రీం తీర్పుతో వెనుకబడిన కులాలకు లబ్ధి



ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమేనని సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. అణగారిన వర్గాల పోరాటానికి న్యాయం జరిగింది. సుప్రీం తీర్పుతో ఎస్సీ, ఎస్టీలోని వెనుకబడిన కులాలకు లబ్ధి చేకూరుతుంది.

- ఒంటెద్దు ఏసువరప్రసాద్, బీజేపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్

30 ఏళ్ల కష్టానికి న్యాయం



మాదిగలకు విద్య, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని చేపట్టిన ఏబీసీడీ వర్గీకరణ 30 ఏళ్ల పోరాటం సుప్రీంకోర్టు తీర్పుతో పడిన కష్టానికి సంతోషం కలిగింది.

- కె.హైమావతి, జిల్లా ఎన్ఎస్‌పీ అధ్యక్షురాలు

ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం



ఎస్సీ వర్గీకరణ కోరుతూ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా చేసిన పోరాట ఫలితమే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. వర్గీకరణతో అందరికీ సమన్యాయం జరుగుతుంది. ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబు, సుప్రీం న్యాయమూర్తులకు మాదిగ జాతి రుణపడి ఉంటుంది.

ఏపూరి దాలయ్య, మాజీ ఎంపీపీ, ఎంఆర్‌పీఎస్ నేత, ద్వారకా తిరుమల

మాదిగ జాతి రుణపడి ఉంటుంది



వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. మాదిగ జాతి చంద్రబాబుకు రుణపడి ఉంటుంది. వర్గీకరణ ఏ ఒక్కరికి వ్యతిరేకం కాదు.

- ముప్పిడి శామ్యూల్, ఎంఈఎఫ్ చింతలపూడి మండల నాయకుడు

(పెదవేగి/కామవరపుకోట/ ద్వారకాతిరుమల/చింతలపూడి)

బదిలీలు ఇంకెప్పుడు..!

- పోలీసు శాఖలో సిబ్బంది మనోవేదన
- పిల్లల చదువుల విషయంలో గందరగోళం

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : నిజాయితీగా పనిచేస్తున్న వరిని వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు కక్ష సాధింపుగా బదిలీలు చేయించారు. బదిలీలు జరగని పక్షంలో మెమోలపై పంపించి తమకు అనుకూలమైన వారిని బదిలీలపై లేదా మెమోలపై రప్పించుకోవడం చేశారు. ఆ తర్వాత ఎస్ఐ స్థాయి నుంచి సీఐ స్థాయి అధికారులకు ఎన్నికల బదిలీలు జరిగాయి. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడి రెండో నెల వస్తున్నా బదిలీలు లేనేలేవు. మరోవైపు స్కూళ్లు, డిగ్రీ కాలేజీలు ప్రారంభం కాగా, ఇంజనీరింగ్, ఒకేషనల్ కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతోంది. వీటిలో కూడా రేపోమాపో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీలు లేక పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు అయోమయ పరిస్థితిలోనే ఉన్నారు. బదిలీలు ఎప్పుడు జరుగుతాయో, ఏ ప్రాంతానికి బదిలీ అవుతారో తెలియని పరిస్థితి. తమ పిల్లల చదువులు ఎలా కొనసాగించాలో అర్థంకాక మనోవేదనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలో వివిధ ప్రాంతాల్లో పోస్టింగులు పొందిన వారు యథేచ్ఛగా అక్కడే ఉంటూ వైసీపీ నాయకులకు అనుకూలురుగా సేవలు అందిస్తూనే ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా గతంలో ఏ ప్రాంతాల నుంచి మెమోలపై వచ్చారో.. ఎవరు బదిలీలు అయ్యారో పరిశీలించి తిరిగి బదిలీలు చేపట్టాల్సి ఉంది.

ట్రిపుల్ ఐటీలో రహస్య విచారణ!

నూజివీడు, ఆగస్టు 1: నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల లైంగిక వేధింపులపై ఏలూరు జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గురువారం రహస్య విచారణ జరిపారు. అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం కొన్ని నెలల క్రితం నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు, ఈ క్యాంపస్‌లో చదువుతున్న ఒక విద్యార్థినిని నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళ అవుటింగ్‌కు తీసుకెళ్లారనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఈ విషయం పత్రికల్లో వచ్చింది. దీంతో ట్రిపుల్ ఐటీ అధికారులు ఒక కమిటీని విచారణకు నియమించారు. అయితే ఈ కమిటీ విచారణ తూతూ మంత్రంగా జరిపి ఒక నివేదిక ఇచ్చినట్టు సమాచారం. ఆ కమిటీ నుంచి నివేదిక అందిన తరువాత సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు విచారణ జరపమని ఆదేశించడంతో గురువారం ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఈ వివాదంలో సంబంధం ఉన్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, మధ్యాహ్నం 12.30 గంటలకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని 13వ సమావేశ మందిరానికి హాజరు కావాలని సమాచారం ఇచ్చారు. అయితే ఈ విచారణ రహస్యంగా జరిగింది. వివరాలు గోప్యంగా ఉన్నాయి. మరోవైపు క్యాంపస్‌లో ఈ విచారణ సంచలనం రేపింది.

గోదావరి తగ్గుముఖం

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు.. చాట్రాయి మండలంలో పొంగిన వాగులు



కుక్కునూరు మండలం వింజరం వద్ద తగ్గిన గోదావరి

కుక్కునూరు/ పోలవరం/ చాట్రాయి/చింతలపూడి/ బుట్టాయగూడెం, ఆగస్టు 1 : గోదావరి వరద నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం 42.80 అడుగుల నీటిమట్టం భద్రాచలం వద్ద నమోదైంది. అనంతరం నెమ్మదిగా తగ్గుతూ సాయంత్రం ఆరు గంటలకు 41.20 అడుగులు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. కుక్కునూరు మండలంలో వరద ప్రభావిత గ్రామాల్లో వరద నిలకడగా ఉంది. దాదాపు ఇరవై రోజులుగా గోదావరి వరద ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. గోదావరి తీరంలో ఇంత వరకు వ్యవసాయ పనులు ప్రారంభంకాలేదు. వందలాది ఎకరాల్లో వరినారుమడులు ముంపులోనే ఉన్నాయి. పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు రోజు గడవని పరిస్థితి ఏర్పడింది. గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి పోలవరం వద్ద తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 9,65,820 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం తగ్గడంతో కడెమ్మ స్లూయిజ్ వద్ద నీటిమట్టం కొంత తగ్గడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న కొండవాగుల జలాలు గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 14.42 మీటర్లు ఉందని, వరద ఉధృతి క్రమంగా తగ్గుతుండడంతో 10,60,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేయగా మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉందని ధవళేశ్వరం బ్యారేజి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ తెలిపారు. భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో శుక్రవారం నాటికి నీటిమట్టం తొలుత పెరిగి తర్వాత తగ్గే అవకాశాలున్నాయన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు గోదావరి జలాల పంపిణీ నిలిపివేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు గురువారం సాయంత్రం తెలిపారు.

పొంగిన వాగులు.. మునిగిన వరిపొలాలు

చాట్రాయి మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉప్పవాగు, లోతువాగు, చింతకొయ్యవాగు, అడవివాగు ఉధృతంగా ప్రవహించాయి. చాట్రాయి, ఆరుగొలనుపేట గ్రామాల్లో వరి పొలాలు వరద ముంపునకు గురై వరి నాట్లు కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి వరద నీరు విడుదల కొనసాగుతోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షం వల్ల క్యాచ్‌మెంట్ ఏరియాలో వరద నీరు చేరడంతో జలాశయ నీటిమట్టం 350 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 586 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 1,048 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలోని శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం రెండు గేట్లను ఎత్తి 200 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. ఏజెన్సీ అటవీ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున కొండవాగుల ద్వారా జలాశయంలోకి 200 క్యూసెక్కుల వరదనీరు వస్తుందని జలాశయం నీటిమట్టం పూర్తి సామర్థ్యం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215.80 ఎంటీఎస్‌కు చేరడంతో గురువారం రాత్రి 10.30 గంటలకు దిగువకు నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.



చాట్రాయి- జనార్దనవరం మధ్య ఉప్పవాగు ఉధృతి

జిల్లాలో పలుచోట్ల జోరుగా వర్షం



ఆరుగొలనుపేటలో నీట మునిగిన వరిపొలాలు

ఏలూరు సిటీ : జిల్లాలో జోరుగా వర్షాలు కురిశాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో భారీగానే వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా లింగపాలెం మండలంలో 122.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 27 మి.మీ నమోదైంది. భారీగా కురిసిన వర్షాల వల్ల జిల్లాలో పలు చోట్ల వాగులు పొంగాయి. లింగపాలెం మండలం నుంచి కామవరపుకోట వెళ్లే మార్గంలో గుండేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. టి.నరసాపురంలో 80.2, ద్వారకా తిరుమల 69.4, పెదవేగి 58.6, చింతలపూడి 57.2, కామవరపుకోట 55.4, ఉంగుటూరు 46.8, ముసునూరు 36, కొయ్యలగూడెం 32.4, భీమడోలు 32, దెందులూరు 26.2, ఏలూరు రూరల్ 22.4, జంగారెడ్డిగూడెం 18.8, నూజివీడు 18.4, నిడమర్రు 14.4, ఏలూరు అర్బన్ 13.6, కుక్కునూరు 13, వేలేరుపాడు 11, బుట్టాయిగూడెం 9.4, మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో ఐదు మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.



గోపవరంలో వృద్ధురాలికి పింఛన్ నగదును అందజేస్తున్న మంత్రి పార్థసారథి

98 శాతం పింఛన్ల అందజేత

ఏలూరు సిటీ, ఆగస్టు 1 : ఏలూరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ గురువారం సాయంత్రానికి 98 శాతం పూర్తయిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలోని ఆగస్టులో 2,66,867 మంది పింఛన్ దారులకు రూ.113.99 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఉదయం 6గంటల నుంచి పంపిణీ ప్రారంభం కాగా సాయంత్రానికి 2,59,063 మందికి పంపిణీ జరిగిందన్నారు. ఉంగుటూరు, ఏలూరులో జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని పెన్షన్ అందించారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు, గోపవరంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పెన్షన్లు అందించారు.

ఎస్ఎంసీల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : జిల్లాలోని 1,810 ప్రభుత్వ పాఠశాలలకు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు డీఈవో, సమగ్రశిక్ష ఇన్‌చార్జి ఏపీసీ అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఇందులో భాగంగా గురువారం సంబంధిత ఎన్నికలు జరిగే పాఠశాలల్లో నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు, నోటీసు బోర్డుల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. జాబితాలో అభ్యంతరాలుంటే హెచ్ఎంలు సవరించి 5న తుది ఓటర్లజాబితాలను ప్రదర్శిస్తారు. ఎస్ఎంసీల సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికలు సజావుగా జరిగేందుకు వీలుగా ఎస్పీ, డీఆర్వో, జడ్పీ సీఈవోల సహకారాన్ని కోరాము. ఈనెల 8న ఎన్నికలు ఎంఈవోలు, ఎంపీడీవో, తహసీల్దార్, వీఆర్వో, వీఆర్ఏల పర్యవేక్షణలో జరుగుతాయి. ప్రతీ ఐదు మండలాలకు ఇన్‌చార్జిగా సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం నుంచి ఒక సెక్టోరల్ ఆఫీసర్ చొప్పున నియమించాం' అని తెలిపారు.

ఐపీఎస్‌కు భాను ప్రత్యూష

ప్రస్తుతం ఏలూరు డిప్యూటీ కలెక్టర్‌గా విధులు



కాళ్ళ, ఆగస్టు 1 : పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం సీసలి గ్రామానికి చెందిన గణేశ్న భాను శ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష ఐపీఎస్‌కు ఎంపిక య్యారు. ప్రత్యూష ఇటీవల వచ్చిన యూపీఎస్సీ ఫలితాలలో 198వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. గత ఏడాది ఆగస్టులో విడుదలైన గ్రూప్ వన్ పరీక్షా ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి ప్రస్తుతం ఏలూరు ప్రొబే షనరీ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఐపీఎస్‌కు ఎంపికవగా ఆగస్టు 26 నుంచి ముస్సోరిలో ఐపీఎస్ శిక్షణకు హాజరు కానున్నారు. కాళ్ళ మండలం సీసలి గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఉషా దంపతులకు ఏకైక సంతానమైన ప్రత్యూష మొదట నుంచి చదువుపై ఉన్న ఆసక్తి, ఉన్నత స్థానాలకు వెళ్లాలనే సంకల్పంతో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంక్ సాధించిందన్నారు. తల్లి గృహిణి కాగా, తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ప్రస్తుతం భీమవరం డీఈవో ఆఫీస్‌లో ఏపీవోగా పనిచేస్తున్నారు. ప్రత్యూషను గ్రామస్థులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్క రించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ/ ఎస్ఎఫ్‌టీ డబ్ల్యు, అవార్డులకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్ఎంలు, టీచర్లు, టీచర్ ఎడ్యుకేటర్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పురస్కారాలకు అర్హతల వివరా లను deoeluru.org వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.దరఖాస్తు నమూనా లను సంబంధిత విద్యాశాఖ తనిఖీ అధికారుల నుంచి పొందాలని సూచించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా సంబంధిత తనిఖీ అధికా రుల ద్వారా ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

గురుకుల విద్యార్థులకు పతకాల పంట

పెదవేగి, ఆగస్టు 1 : పెదవేగిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభతో పతకాలు సాధించారు. జూలై 27, 28 తేదీలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. క్రీడాపోటీల్లో ఏడుగురు జంప్‌రోప్‌లో పాల్గొనగా రెండు బంగారు, నాలుగు కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు, పీడీ కె.జయరాజు, పీఈటీ పి.గురుమూర్తి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొత్తం ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనగా రంజిత్‌కుమార్, దుర్గదీప్‌లు బంగారు పతకాలు సాధించారని చెప్పారు. అమితేష్, సతీష్, అభిలాష్, రాకేష్ నలుగురు కాంస్య పతకాలను అందుకున్నారన్నారు. వీరిలో ముగ్గురు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

త్వరలోనే రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు

భీమవరం రూరల్, ఆగస్టు 1 : రబీ సీజన్‌లో 71,446 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామని, ఇప్పటివరకు 976 కోట్ల 41 లక్షలు జమ చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ధాన్యం డబ్బులు ఇవ్వాలంటూ ధర్నా వార్తపై వివరణ ఇచ్చారు.ఇంకా జిల్లాలో 424 కోట్ల 33 లక్షలు ఇవ్వవలసి ఉందని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తరువాత రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.



స్నేహితురాలి ప్రాణం కోసం..

ఏలూరు రూరల్, ఆగస్టు 1: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఏలూరు ఒక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్ఞానేశ్వరికి (14) లివర్ మార్పిడి జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఆమె విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఆపరేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చవుతోంది. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమె స్నేహితురాళ్ల సాయం కోసం ముందుకు వచ్చారు. ప్రముఖ నాట్యాచారిణి స్వర్ణలత ఆధ్వర్యంలో పురవీధుల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అర్థించారు.

ఏలూరు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సుధాకర్, ఆర్ఎంవోగా దుర్గాకుమార్



సుధాకర్,కుమార్‌లకు సత్కారం



ఏలూరు క్రైం, ఆగస్టు 1: ఏలూరు ప్రభుత్వా సుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ సీహెచ్ సుధాకర్ బాధ్య తలు చేపట్టారు. ఇప్పటి వరకూ మెడికల్ సూప రింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ అగ్నస్ విజయ జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డాక్టర్ సుధాకర్‌ను నియ మించారు. ఇప్పటివరకూ ఆసుపత్రి ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకోవడంతో ఆయన స్థానంలో ఆసుపత్రి కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాకుమార్‌ను నియ మించారు. దుర్గాకుమార్ గతంలో కామయ్యపాలెం పీహెచ్‌సీ వైద్యులుగా పని చేశారు. అనంతరం సిద్ధార్థ మెడికల్ కాలేజీ విజయవాడ, నెల్లూరులో కూడా పనిచేస్తూ అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీలో చేరారు. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనూ, ఏలూరు ఎంహెచ్‌వోగాను పని చేశారు. దీంతో ఆయనను ఆసుపత్రి రెసిడెన్షి మెడికల్ ఆఫీసర్‌గా నియమించారు. దుర్గాకుమార్‌ను క్లాస్ ఫోర్ ఉద్యోగుల నాయకులు లక్ష్మణకుమార్, దాసు, హరి బాబు పలువురు దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ సుధాకర్‌ను ఆసుపత్రి అత్యవసరపు వైద్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ మొబీనా, డాక్టర్ రేష్మాలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ వేలిముద్రలతో రూ.30 వేలు కొట్టేశారు..

తిరిగి అకౌంట్‌లోకి రప్పించిన సైబర్ క్రైం పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : సైబర్ నేరగాళ్ళు ఆధార్ వేలిముద్రలు ద్వారా బ్యాంకు అకౌంట్‌లో ఉన్న నగదును అపహరించడంతో బాధితుడు సైబర్ టోల్ ఫ్రీనెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి బాధితుడి అకౌంట్ నుంచి అపహరణకు గురైన సొమ్మును తిరిగి రప్పించారు. దీంతో బాధితుడు జిల్లా ఎస్పీ కిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావుకు ఏలూరు స్టేట్ బ్యాంక్‌లో సేవింగ్స్ అకౌంట్ ఉంది. అతని ఆధార్‌కార్డు అథెంటికేషన్ ద్వారా అతనికి తెలియకుండా రూ.30 వేలు అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేశారు. దీంతో బాధితుడు సైబర్ సెల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన సొమ్మును తిరిగి తన అకౌంట్‌కు రప్పించారు.

గ్రీన్ ట్యాక్స్ మోత



దడ పుట్టిస్తున్న హరిత పన్ను
పక్క రాష్ట్రాల్లో వందల్లో.. ఇక్కడ వేలల్లో
గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు
కూటమి హామీ నెరవేర్చాలని డిమాండ్



పాలకొల్లు, ఆగస్టు 1: జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేసిన అరాచకాలు రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. ఒకటి, రెండూ కాదు అన్ని రంగాలను ఒక ఆట ఆడిన జగన్ ప్రభుత్వం చీడ ఇప్పటికీ వాహన యజ మానులను వెంటాడుతూనే ఉన్నది. రవాణా వాహనాలకు, పాసింజర్, సొంత వాహనాలకు వివిధ రూపాల్లో హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) వసూలు చేస్తారు. వాస్తవానికి ఈ పన్ను వసూలు విధానం కేంద్ర ప్రభుత్వానిది. అయితే దేశంలోని ఆయా రాష్ట్రాలు హరిత పన్నును తమ పరిస్థితుల మేరకు పన్ను వసూళ్లను మదింపు చేస్తుంటాయి. కాలం తీరిన వాహనాల నుంచి వచ్చే కర్బన ఉద్గారాలు (కార్బండయాక్సైడ్) శాతం పెరుగు తుండటాన్ని బట్టి గ్రీన్ ట్యాక్స్ పెరుగుతూ ఉంటుంది. గూడ్స్ వెహికల్స్, పాసింజర్ వెహికల్స్‌కు కొనుగోలు రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఎనిమిదేళ్ల తరువాత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సొంత వాహనాలకు అయితే కొనుగోలు రిజిస్ట్రేషన్ అనంతరం 15 ఏళ్ల వరకూ గ్రీన్ టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు.

> సమీప రాష్ట్రాలలో గ్రీన్ టాక్స్ రూ. 500 నుంచి 1500 మాత్రమే ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 6 నుంచి 9 వేలు వరకూ ఉంది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో సైతం హరిత పన్ను అధికంగా వసూలు చేస్తున్న ప్పటికీ దేశంలోని అధికశాతం రాష్ట్రాలలో సరళంగానే ఉంది. మన రాష్ట్రంలో మాత్రం జగన్ రెడ్డి ప్రభుత్వానికి ముందు వందల్లో ఉన్న గ్రీన్ టాక్స్ ఇప్పుడు వేలల్లోకి పెరిగింది.

కూటమి హామీ నెరవేర్చాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హరిత పన్ను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వాహన రంగం తగిన కిరాయిలు లేక కుదేలైన పరిస్థితుల్లో గ్రీన్ ట్యాక్స్, రోడ్ ట్యాక్స్, ఫిటినెస్, వీటికి తోడు టోల్ ట్యాక్స్‌లు, నిర్వహణ వ్యయం..ఇవన్నీ రవాణా వాహనాల ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని వందల సంఖ్యలో ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఇతర రాష్ట్రాలలో అమ్మకాలు జరిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో నేరుగా వాహన యజమానులకు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో గ్రీన్ ట్యాక్స్ వేలల్లో ఉండటం పట్ల విస్మయం వ్యక్తం చేశారని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన ట్యాక్స్ తగ్గిస్తామని హామీ ఇచ్చినట్టు ఈ సందర్భంగా వాహన యజమానులు గుర్తు చేస్తున్నారు

రవాణా రంగాన్ని ఆదుకోవాలి



గడచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి అసోసియేషన్ నేరుగా మద్దతు ఇచ్చింది. వివిధ రూపాలలో అధికంగా వసూలు చేస్తున్న పన్నులను తక్షణం తగ్గించాలి. ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను కూడా 10 నుంచి 20 శాతం తగ్గిస్తే రవాణా రంగం కష్టాల నుంచి గట్టెక్కుతుంది.

- టిప్పర్ లారీ యజమానులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రావూరి రాజా

వామ్మో.. ఇలా అయితే కష్టమే !

సిలబస్ మార్చాల్సిందే..
ఒక్కో పాఠ్యాంశం 14 పేజీలా ?
ఐఏఎస్‌ల మాదిరిగా 9, 10 తరగతుల పిల్లలకు పాఠాలేమిటి ?!
'పది' పరీక్షల మీడియంపై స్పష్టతేదీ ?
కొత్త పాఠ్య పుస్తకాలపై పునశ్చరణ తరగతుల్లో టీచర్ల అభ్యంతరాలు



ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : హైస్కూలు విద్యార్థులకు ముచ్చెమటలు పుట్టించేలా 9,10 తరగతులకు ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టిన నూతన సిలబస్ పాఠ్యాంశాలున్నాయి. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కేంద్ర మానవ వనరుల శాఖ అనుబంధ సంస్థ ఎన్‌సీఈఆర్‌టీ అందజేసిన నూతన సిలబస్ 9,10 తరగతుల పాఠ్యపుస్తకాలనే యదాతథంగా రాష్ట్రాలకు పంపిణీ చేసింది. వాటిలో పాఠ్యాంశాలను పరిశీలిస్తే ఐఏఎస్ వంటి జాతీయ స్థాయి ఉన్నత విద్య గ్రంథాల మాదిరిగా ఉన్నాయని ఉపాధ్యాయులే అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నూతన పాఠ్యపుస్తకాలపై సంబంధిత తరగతుల సబ్జెక్టు టీచర్లకు పునశ్చరణ తరగతులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒక్కో పాఠ్యాంశం 13-15 పేజీలు పైబడి ఉండటాన్ని, మరీ కఠినంగా రూపొందించడాన్ని ఉపాధ్యాయులు ఓరియంటేషన్ తర గతుల్లో నేరుగానే అభ్యంతరాలను లేవనెత్తారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఆంగ్ల మాధ్యమంలోనే రాయాలంటూ గతంలో వైసీపీ ప్రభుత్వం జారీచేసిన మౌఖిక ఆదేశాల ప్రకారం కొత్త సిలబస్‌తో పరీక్షలు రాయలేరన్న ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఏ మాధ్య మంలో పది పరీక్షలు రాయాలన్నదానిపై కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి అధికారిక నిర్ణయాన్ని వెలువరించకపోవడాన్ని కూడా పునశ్చరణ తరగతుల్లో పలువురు టీచర్లు ప్రస్తావించారు. జాతీయస్థాయిలో హిందీ అధికారిక భాషగా వున్న రాష్ట్రాలకు అనుగుణంగా రూపొందించుకున్న నూతన సిలబస్‌ను తెలుగు మాతృభాషగా వున్న ఏపీపై బలవంతంగా రుద్దడంపై కొందరు ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్తగా ప్రవేశ పెట్టిన 9,10 తరగతులకు సంబంధించి హిందీ, ఇంగ్లీషు, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల పాఠ్యపుస్తకాల సిలబస్ చాలా కఠినంగా ఉందని వీటిని విద్యార్థులకు సులువుగా బోధించడం చాలా కష్ట సాధ్యమని ఉపాధ్యాయులు తేల్చిచెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో వున్న ఈ కఠినతరమైన సిలబస్‌తో కూడిన పాఠాలను చదివి విద్యార్థులు పరీక్షలు రాయడమంటే వారిపై మోయలేని భారాన్ని మోపడమేనని, ఇప్పటివరకు తెలుగు మాధ్యమంలో 9వ తరగతి చదివి ఇపుడు పదోతరగతి పాఠ్యాంశాలను ఆంగ్ల మాధ్యమంలో చదివి, అర్థం చేసుకుని రాయాల్సి రావడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పారు. సబ్జెక్టు టీచర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావును వివరణ కోరగా ప్రధానంగా మూడు సబ్జెక్టుల సిలబస్ బోధన చాలా కష్టసాధ్యంగా ఉందని ఉపాధ్యాయులు చెప్పారు. పాఠ్యాంశాల నిడివిని కుదించాలని హిందీ, సోషల్ స్టడీస్ టీచర్లు సూచనలు చేశారు. "శుక్రవారం ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లకు పునశ్చరణ తరగతులుంటాయి. మిగతా సబ్జెక్టులకు వెబెక్స్ విధానంలో నిర్వహిస్తాం. సిలబస్ భారం, బోధనలో సమస్యలు, విద్యార్థుల ఎదుర్కొనే క్లిష్టతలపై కొందరు టీచర్లు లేవనెత్తిన అభ్యంతరాలను ఎస్‌సీఈఆర్‌టీకి తెలియజేయడం మినహా జిల్లా స్థాయిలో మేమేం చేయలేం. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీచర్లకు ఓరియం టేషన్ క్లాసుల నిర్వహణ వరకే మా బాధ్యత.' అని డీసీఈబీ కార్యదర్శి వివరించారు.

తాకట్టు.. లోగుట్టు..!



లక్షల విలువ చేసే ఆభరణాలు తాకట్టు పెట్టినా రశీదు ఇవ్వరు
వ్యాపార నిబంధనలకు తూట్లు
కొరవడిన అధికారుల పర్యవేక్షణ



నరసాపురం, ఆగస్టు 1: ఉభయగోదావరి జిల్లాల్లో నరసాపురం బంగారం, తాకట్టు వ్యాపారానికి పెట్టింది పేరు.నిత్యం కోట్లల్లో వ్యాపారం జరుగుతుంది, చాలామంది తమ అవసరాలకు ఇక్కడి వ్యాపారుల వద్ద బంగారు వస్తువులు తాకట్టు పెట్టి అప్పులు తీసుకోవడం అనవాయితీగా వస్తున్నది. బ్యాంకుల ఇచ్చే రుణం కంటే ఇక్కడి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో అప్పు ఇస్తుండమే ఇందుకు కారణం. జిల్లాలో ఎక్కడా లేనన్ని తాకట్టు దుకాణాలు పట్టణంలో ఉన్నాయి. దాదాపు 100కు పైగా షాపులు ఉన్నాయి. ఈ వ్యాపారం చేసేందంతా ఉత్తరాది ప్రాంతానికి చెందిన మార్వాడీలే.

అప్పు ఎంతైనా ఇస్తారు.. రశీదు ఉండదు

ప్రభుత్వం జారీచేసిన లైసెన్స్‌కు అనుగుణంగా ఇక్కడి వ్యాపారులు తాకట్టు వ్యాపారం చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి ఉషారాణి సంఘటన బలం చేకూర్చినట్టైయింది. గడిచిన రెండేళ్లుగా ఈమె 20 సార్లుపైనే వివిధ వస్తువుల్ని తాకట్టు పెట్టింది. అయితే ఒక్కసారి కూడా వ్యాపారి రశీదు ఇవ్వలేదు. లక్షలు విలువ చేసే వస్తువులు తాకట్టు పెట్టినా వాటికి సంబంధించిన ఎటువంటి రశీదు ఇవ్వకపోవడం వల్ల కొన్ని సమ యాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వెలుగుచూసిన ఉషారాణి సంఘటన కూడా ఇలాంటిదే. గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో మార్కె ట్‌లో వెలుగుచూశాయి. వాటిని వ్యాపారులు బయటకు పొక్క నివ్వలేదు. కొందరు కస్టమర్లు తాకట్టు పెట్టిన దుకాణం వివరాలను కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆ కస్టమర్ హఠాత్తుగా మరణిస్తే ఆ వస్తువులు విడిపించుకోవడం కుటుంబ సభ్యులకు పెద్ద సమస్యగా మారుతుంది. రశీదు లేకపోవడం వల్ల వ్యాపారి తన దగ్గర తాకట్టు పెట్టలేదని చెప్పితే ఏమీ చేయలేని పరిస్థితి. అయితే ఈవ్యాపారమంతా నమ్మకం మీదే సాగుతోంది. కస్టమర్‌పై నమ్మకంతో ఆభరణాల విలువతో సమానంగా అప్పు ఇస్తున్నారు. ఇదే నమ్మకంతో కస్టమర్ కూడా బిల్లు తీసుకోవడం లేదు. అయితే తాకట్టు నిబంధనల ప్రకారం వ్యాపారి కచ్చితంగా రశీదు ఇవ్వాలి. ఇక్కడ ఈ నిబంధనలను కొందరు వ్యాపారులు పాటించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదాయ పన్ను తప్పించుకునేందుకే రశీదులు ఇవ్వరన్న వాదనలు వినిపి స్తున్నాయి. ప్రస్తుతం బంగారం విలువ భారీగా పెరిగింది. కనీసం కాసు వస్తువు తాకట్టు పెడితే రూ.30 వేలు వరకు అప్పు ఇస్తారు. ఇలా రోజుకు కొన్ని లక్షల రూపాయలు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. కానీ ఎక్కడా రశీదులు ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కొందరు వ్యాపారులు నిబంధనలను పాటిం చడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పింఛన్ల పంపిణీకి వచ్చి..వెళ్లిపోయారు

ఎమ్మెల్యే బాలరాజు తీరుతో స్థానిక నాయకుల్లో అయోమయం

బుట్టాయగూడెం, ఆగస్టు 1 : పింఛన్లు పంపిణీ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే అకస్మాత్తుగా వెనుతిరిగి వెళ్లిపోవడంతో అక్కడ ఉన్నవారంతా విస్మ యానికి గురయ్యారు. బుట్టాయగూడెం మండలం కృష్ణాపురంలోని ముది రాజ్‌పేట, తెల్లంవారిగూడెం, దొరమామిడి ప్రాంతాల్లో అర్హులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పింఛన్లు అందజేస్తారని కార్యాలయం వర్గాలు బుధ వారం రాత్రి నుంచే వారి అధికారిక గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. ఈ కార్య క్రమంలో కూటమి నేతలంతా పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే వస్తారని అధికారులు, సచివాలయం సిబ్బంది అంతా సిద్ధం చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు తీసుకోడానికి పేదలు కూడా ఎదురు చూస్తున్నారు. ప్రకటించినట్టుగానే గురువారం ఉదయం ఎమ్మెల్యే కృష్ణాపురం చేరుకు న్నారు. కారణం తెలియదుకాని పది నిమిషాలు గడవకముందే వెనుతిరిగి వెళ్లిపోయారు. అక్కడున్న నాయకులకు ఎమ్మెల్యే ఎందుకు వెళ్లిపోయారో తెలియక తికమక పడ్డారు. కార్యక్రమానికి వచ్చిన కొద్దిమంది కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక జనసేన నాయకులకు సమాచారం ఇవ్వక పోవడంతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో చేసేది లేక ఎమ్మెల్యే వెనుతిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే బాలరాజును ఆంధ్రజ్యోతి అడగ్గా స్థానిక నాయకులకు సమాచారం లేనందున మనస్పర్థలు రాకుండా ఉండాలని వెళ్లిపోయినట్లు తెలిపారు.

పాలకొల్లులో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాలి

ప్రభుత్వానికి చేగొండి హరిరామ జోగయ్య లేఖ

పాలకొల్లు, ఆగస్టు 1 : రాష్ట్రంలో సినీ పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందేందుకు ఉభయ గోదావరి జిల్లాలకు అనుకూలంగా ఉండే పాలకొల్లులో మెగా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొలాలని సినీ నిర్మాత, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరి రామజోగయ్య రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ విషయాన్ని గురువారం విలేకర్లకు తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సినీ పరిశ్రమలో ముఖ్యమైన అనుబంధ విభాగాల్లో శిక్షణ ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. కళలకు పుట్టినిల్లుగా పిలువబడే పాలకొల్లులో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాలని దీనికి ఎస్వీ రంగారావు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌లకు లేఖ పంపి నట్టు జోగయ్య తెలిపారు.



రోడ్డుపైనే నిలిచిపోయిన మురుగునీరు

ఆలమూరులో జ్వరాలు

వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యాలని ఎమ్మెల్యే ఆదేశం

పెనుమంట్ర, ఆగస్టు1 : పెనుమంట్ర మండలం ఆలమూరులో ఏ ఇంట చూసినా జ్వర పీడుతులే.. వారం రోజులుగా విష జ్వరాలు వ్యాపించడంతో ఆలమూరులో బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, కంపు కొడుతున్న రహదారుల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలు తున్నాయి.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మొక్కుబడిగా సర్వేలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. జ్వరం వచ్చిన వారు డెంగీ జ్వరాల భయంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఆలమూరులో మాత్రం ఒక్క డెంగీ కేసు మాత్రమే నమోదైందని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించామని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రదీప్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆలమూరు గ్రామానికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి విచ్చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వైద్య సేవలపై ఆరా తీశారు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైరల్ జ్వరాలు వస్తున్నాయని డెంగీ జ్వరాలుగా భావించి ప్రజలు ఆందోళన చెందుతున్నారని డాక్టర్ ప్రదీప్ చెప్పారు..

క్రైం కార్నర్

పట్టపగలు రెండు ఆక్వా దుకాణాల్లో చోరీ

ఆకివీడు, ఆగస్టు 1 : ఆకివీడులో స్టేట్ బ్యాంకు సమీపంలో పట్టపగలు రెండు ఆక్వా దుకాణాల్లో చోరీ జరిగింది. రోజులాగానే రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి ఆక్వా మేత దుకాణాల గుమస్తాలు గ్లాస్ డోర్‌లు వేసి భోజనాలకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తలుపులు తీసి ఉండడంతో పాటు సురుగులో ఉండాల్సిన నగదు కనబడలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా మెడలో కండువా వేసు కొని ఒక వ్యక్తి అటూ ఇటూ తిరుగుతుండగా అప్పుడే స్కూటీపై ఒక వ్యక్తి వచ్చి తాళాలు వేసి ఉన్న గ్లాస్ డోర్‌లు లివర్‌తో ఓపెన్ చేసి లోపలికి వెళ్లాడు. రాజ్యలక్ష్మి ఆక్వా దుకాణంలో రూ.14 వేలు, ధనలక్ష్మి ఆక్వా దుకా ణంలో రూ.30 వేలు నగదు దొంగిలించినట్లు షాపు నిర్వాహకులు తెలుపు తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించి వెళ్లారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

భీమవరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం క్రైం, ఆగస్టు 1 : భీమవరం పట్టణంలో బైపాస్ రోడ్డులో గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళా శాల దాటిన తరువాత పుంత రోడ్డులో ఒక గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం కనిపించింది.వయసు సుమారు 65 సంవత్సరాలు ఉంటుంది. జారిపడిపోయి కింద తలకి గాయం అయి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే ఎస్ఐ 94407 96633 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

ఏలూరు రైల్వే గేటు వద్ద..

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరు నిమ్మకాయల మార్కెట్ యార్డు రైల్వే గేటు వద్ద ఒక గుర్తు తెలి యని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో రైల్వే ఎస్ఐ సైమన్ వెళ్లి పరిశీలించారు. మృతుడు సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కల్గి, 5.8 అడుగుల ఎత్తు ఉన్నాడు. ఆలివ్ గ్రీన్ రంగు పొట్టి చేతుల టీషర్టు, ఆకుపచ్చ రంగు లోయరు ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారిపడ్డాడా లేదా మరేదైనా ప్రమాదం వల్ల మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ నంబర్ 99892 19559కు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 1 :కారణం తెలియదు కాని ఒక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. లింగపాలెం మండలం కొత్తపల్లికి చెందిన మౌనిక (34)కు టి.నర్సాపురం మండలం బొర్రం పాలెంనకు చెందిన సంసోన్‌తో వివాహం అయింది. ఒక కుమార్తె ఉంది. ఏడాది క్రితం గొడ వలు రావడంతో ఆమె తన కుమార్తెతో పుట్టింటికి కొత్తపల్లి వచ్చేసి అక్కడే ఉంటున్నది. ఏమైందో ఏమో కాని గురువారం మధ్యాహ్నం పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆమె అప్పటికే మరణించిందని నిర్ధారించి ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా భావించి ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : మొదటి భార్య పిల్లలను రెండవ భార్య చూడడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఒక వ్యక్తి పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. భీమవరంలోని గునుపూడికి చెందిన ఐకె శ్రీనివాసరావు (45)కు మొదటి భార్య మరణించగా, ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో పెళ్లి చేసుకోగా ఆమెకు ఒక కుమార్తె పుట్టింది. మొదటి భార్యకు పుట్టిన ఇద్దరు మగ పిల్లలను సరిగా చూడడం లేదనే విషయమై వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం పురుగు మందు తాగాడు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్..యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : పదో నంబర్ జాతీయ రహదారిపై లారీ టైర్ పంక్చర్ కావడంతో గురువారం రాత్రి లారీ నిలిపివేశారు. అతివేగంగా వస్తున్న మోటారు సైకిలిస్టు అది గమనించకుండా ఢీ కొనడంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. ఏలూరు వైపు నుంచి తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై మార్గమధ్యలో పూళ్ళ వద్ద ఒక లారీ టైర్ పంక్చర్ అవడంతో నిలిపి వేశారు. ఏలూరు వైపు నుంచి అతి వేగంగా వస్తున్న మోటారు సైకిలిస్టు ఆ లారీని వెనుక నుంచి ఢీ కొన్నాడు. దీంతో అతనికి హెల్మెట్ లేక పోవడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. మోటారు సైకిల్ నెంబర్ ఎపీ 37 డీఎన్ 0807గా ఉంది. భీమడోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు ప్రభు త్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 1 : మోటారు సైకిళ్లను అపహరిస్తున్న ముగ్గురు యువకులను ఏలూరు రూరల్ పోలీ సులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ఏలూరు కుమ్మరిరేవు రెండవ వీధికి చెందిన కర్రి సత్యనారాయణ (22), ఏలూరు డిమార్టు ఎదురుగా మోతేవారి తోటకు చెందిన చిలకల నికిల్‌సాయ్ (19), ఏలూరు తాపీమేస్త్రీ కాలనీ 9వ రోడ్డునకు చెందిన ఉప్పాడ కార్తీక సాయి (21) నగరంలో రాత్రి వేళ తిరుగుతూ మోటారు సైకి ళ్లను అపహరిస్తున్నారు.జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ లక్ష్మణబాబు, హెడ్‌కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్ళు శ్రీనివాసరావు, మోహన్ కృష్ణలు బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. గురువారం సాయంత్రం ఏలూరు వన్ టౌన్‌లోని గాంధీ మైదానం గవర్నమెంట్ వైన్‌షాపు వద్ద స్కూటీపై ఈ ముగ్గురు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



ద్వారకాతిరుమలలో రోడ్డుపై పారుతున్న వర్షం నీరు

ద్వారకాతిరుమలలో భారీ వర్షం

ద్వారకాతిరుమల, ఆగస్టు 1: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకూ ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రదేశాలు వర్షపునీటితో నిండిపోయాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహించింది. ద్వారకాతిరుమలలో సైతం వర్షపు నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. గుడి సెంటర్ వర్ష తీవ్రతతో కాసేపు నిర్మానుషంగా మారింది.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం.. వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 1: తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం ప్రారంభించారు. బిడ్డ పుట్టిన అర గంటలోపే తల్లిపాలను బిడ్డకు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. తల్లిపాలు పడితే బిడ్డతోపాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లిపాలకు దూరమైన పిల్లలకు నిమ్మోనియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.జోషి, ఎంఎల్‌హెచ్‌పి దీప్తి, జి.సాంబశివరావు, బి.వి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

● బుట్టాయగూడెం: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంత ముఖ్యమో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తల్లులకు తెలియజేయాలని సూపర్‌వైజర్ కె.రుఘాన్సీ సిబ్బందికి సూచించారు. బుట్టాయగూడెం అంగనవాడీ కేంద్రం పరిధిలో తల్లి పాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రి పాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. బిడ్డకు రెండేళ్ల వయసు వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని, డబ్బా పాలు పట్టరాదన్నారు. గైనకాలజిస్టులు డాక్టర్ సునీత, డాక్టర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లింగపాలెం, ఆగస్టు 1: ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నిర్మూలనకు వైద్య సిబ్బందికి సహకరించాలని డాక్టర్ అబీద అన్నారు. ఆసన్నగూడెంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆమె పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వరం, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని డాక్టర్ సూచించారు. ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉంటే వెంటనే వారికి వైద్యసహాయం అందించాలని అన్నారు. గ్రామాల్లో ఫాగింగ్, శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి రాణి, ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్, రేణుక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా యూనిట్ ఉప వైద్యాధికారి వైవీ.లక్ష్మణరావు, డాక్టర్ మానస సూచించారు. కాగుపాడు పీహెచ్‌సీ వద్ద సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

కాగుపాడు ఉన్నత పాఠశాలలో మెంటల్ హెల్త్ ప్రోగ్రాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు, ఆగస్టు 1: కాగుపాడు హైస్కూలులో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాజిటివ్ థింకింగ్ అలవరచుకోవాలని డాక్టర్ మానస, డాక్టర్ సాయి అనూష సూచించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు, హెచ్ఎస్ సత్యనారాయణ, హెచ్ఎం తాతిన వెంకన్నబాబు, సైకాలజిస్టు శ్రీనివాసరావు, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ఏలూరులో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 1: నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డి మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శనివారపుపేట ఇందిరమ్మ కాలనీ, దేవంగులపేట, ముస్లింపేటల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, రంజిత్‌కుమార్, లోవరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవి ప్రసాద్, దుర్గారావు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలతో ఆదాయం : కలెక్టర్



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

భీమడోలు, ఆగస్టు 1: చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా ఎరువులను తయారుచేసి పంచాయతీలకు ఆదాయాన్ని పెంచాలని కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. స్థానికంగా చెత్త నుంచి సంపద కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. గ్రామీణ పారిశుధ్యంపై పంచాయతీలు దృష్టి పెట్టాలని కోరారు. సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టుగా విక్రయించి పంచాయతీకి లాభం, రైతులకు నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పాతూరులో ఇళ్ల స్థలాల సమస్యలపై గుండుగొలను గ్రామస్తులు కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతిపత్రం అందించారు. కాలనీకి రహదారులు, డ్రైనేజి వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు.

బాల కార్మికులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్

ఏలూరు సిటీ, ఆగస్టు 1: బాల కార్మికుల దుస్థితి నుంచి బయటకు తీసుకువచ్చి ఉజ్వల భవిష్యత్‌ను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ కె వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక రహిత వ్యవస్థ రూపొందించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. బాల కార్మికులు ఉండే ప్రదేశాలను గుర్తించి తనిఖీలు నిర్వహించాలని, భిక్షాటన చేసే బాలలను, గుర్తించాలన్నారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాసు, ఏఎస్పీ స్వరూపరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొయ్యలగూడెం, ఆగస్టు 1: దళారుల వలన మోసపోయిన రైతులను ఆదుకోవాలని కొయ్యలగూడెం, తాడేపల్లిగూడెం రోడ్డుపై పాత పొగాకుబోర్డు వద్ద గురువారం రాస్తారోకో చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసు మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న పంటలను దళారులు కొనుగోలు చేసి మూడు నెలలు దాటిపోతున్న సొమ్ములు చెల్లించలేదన్నారు. పోలవరం మండలంలో 137మంది రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న పంట దళారులు కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. రైతు కష్టాన్ని దళారులు దోచుకోవడం దారుణమన్నారు. పోలవరం ఎంపీపీ వెంకటరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రాంబాబు, రాంబాబు, టీడీపీ నాయకులు యనమదల ప్రసాద్, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.



ఉంగుటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



ఏలూరులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి



లింగపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్



పోలవరంలో పింఛన్ అందిస్తున్న బొరగం శ్రీనివాస్

పేదలకు భరోసా

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు, భీమడోలు ఆగస్టు 1: పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా 1న సొమ్ము పంపిణీ చేయడానికి ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. ఉంగుటూరు, భీమడోలు మండలం పాతూరులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలసి గురువారం కలెక్టర్ పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు బండారు సింధు మధు, వెజ్జు బాలాజి. డీఆర్డీఏ పీడీ విజయరాజు, డీపీవో విశ్వనాథ్, ఆర్డీవో ఖాజావలి, పాతూరి జగదీశ్, అడపా శోభారాణి, ఎంపీడీవో శర్మ, కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ప్రజా భవిష్యత్‌కు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 8, 9 డివిజన్లలో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. దశల వారిగా హామీలన్ని అమలు చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, మారం హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. 5వ డివిజన్ శాస్త్రి కాలనీ, నాగేంద్ర కాలనీ, రిక్షా కాలనీ, చెంచుకాలనీ, వినాయక నగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు పింఛన్లు పంపిణీ చేశారు. రెడ్డి ఈశ్వరరావు, కే.విఠల్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెం శివారు కాటంరెడ్డిపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, మొరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జియ్య, గుత్తా సత్యసాయి వరప్రసాద్, మొరంపూడి ప్రసాద్, వేంపాటి ప్రసాద్, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో అన్ని పంచాయతీల పరిధిలో ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. అధికారులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు త్వరితగతిన అందేలా పర్యవేక్షించారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, కొణతాల ప్రసాద్, సోమరౌతు అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: గోపన్నపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లుబాబు ప్రభుత్వ సిబ్బందితో కలసి పింఛన్లు అందించారు. శ్రీరామవరంలో మోతుకూరి నాని, జోగన్నపాలెంలో మధుబాబు, దెందులూరులో కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సామజిక ఫించన్లను అందజేశారు,

● ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లి, తిమ్మాపురం, పంగిడిగూడెం, నారాయణపురం, గుణ్ణంపల్లి, ద్వారకాతిరుమల తదితర గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. తిమ్మాపురంలో పోలిన శ్రీను, ఘంటా శ్రీనివాసరావు, జి.కొత్తపల్లిలో సర్పంచ్ కస్సే శ్రీహరి, చక్రధరరావు, పులపాకుల ఘంటాలు, రేగంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: తడికలపూడి, వీరిశెట్టిగూడెం, రామన్నపాలెం పంచాయతీలోని గొల్లగూడెంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 8157 మంది లబ్ధిదారుల్లో 7901 మందికి పెన్షన్లు అందచేసినట్లు ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, ఏవో సత్యవాణి తెలిపారు. మేకా ఈశ్వరయ్య, ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, ఘంటా సుధీర్‌బాబు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, షేక్ వలీ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 29 వార్డుల్లో 97 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్ తెలిపారు. 21వ వార్డు పింఛన్ల పంపిణీలో మారిశెట్టి బాల చిట్టెమ్మ పాల్గొన్నారు. 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మండలంలో 97.87 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కేవీ.ప్రసాద్ తెలిపారు.

● పెదవేగి: మండలంలో పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బందితో కలసి టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు పర్యవేక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, బాపిరాజుగూడెం సర్పంచ్ జోగి పెదపెంటయ్య, మంచినేని శ్రీనివాసరావు, తలకొండ జమలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండలంలో అధికారులు సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. కుక్కునూరులో టీడీపీ మండల అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి లక్ష్మణాచార్యులు, ఎం.యుగంధర్, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

● చింతలపూడి: గ్రామాలు, పట్టణంలో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో 9532 మంది పింఛన్‌దారులకు రాత్రి 7 గంటల వరకు 97.53 శాతంమందికి పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలో 95.54 శాతం మందికి పంపిణీ చేశారు.



జంగారెడ్డిగూడెంలో ఎమ్మార్పీఎస్ నేతల సమావేశం



చింతలపూడి బోసు బొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ తీర్పుపై హర్షం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 1 : ఎస్సీ ఉప కులాలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని గత 30 ఏళ్ల ఉద్యమ లక్ష్యం సుప్రీం కోర్టు తీర్పుతో నెరవేరిందని ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సీపేటలోని కమ్యూనిటీ హాలు వద్ద దళిత సంఘ నాయకుడు నాయకుడు లాగు రవి అధ్యక్షతన గురువారం ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశం జరిగింది. బీఆర్.అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు బొబ్బర రాజ్‌పాల్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ న్యాయమేనని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ తీర్పు రావడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, జి.శ్రీనివాసరావు, ఉప్పాటి రాఘవులు, దున్నా శివ, మద్దిపాటి ఇస్సాకు, కొలుకులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై మండలంలోని దొరసానిపాడులో మాదిగ వర్గీయులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాలు వద్దకు చేరుకుని మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ విజయంతో మాదిగ ఉపకులాలు ముందడుగు వేస్తాయంటూ ఆనందంతో డప్పులను వాయించారు.

● కొయ్యలగూడెం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గణేశ్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాట ఫలితం అన్నారు. మాదిగలకు న్యాయం జరుగుతుందని, ఈ తీర్పుతో అణగారినవర్గాలకు న్యాయం జరిగిందన్నారు. మండలంలోని రాజవరం, బయ్యన్నగూడెం, కన్నాపురం, తదితర గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చినబాబు, సనమండ్ర కనకరాజు, తుక్కయ్య వెంకటేష్, చినరాజు, ముప్పిడి రవి, వెంకటేష్, తదితరులుపాల్గొన్నారు.

● చింతలపూడి: సుప్రీం కోర్టు తీర్పుతో 30ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చారు. సుప్రియన్‌పేట నుంచి పాత బస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు మోటారు సైకిళ్ల ర్యాలీ, కాలినడకన ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. బోసుబొమ్మ సెంటర్లో నాయకులు మాట్లాడుతూ 30ఏళ్ల పోరాటంలో సహకరించిన అన్ని సామాజిక వర్గాలకు, వివిధ రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం ఫైర్‌స్టేషన్ సెంటర్లో తీర్పు వెలువరించిన వెంటనే టపాసులు కాల్చి బాబుజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. యువకులు, మహిళలు భారీగా పాల్గొన్నారు. ఏబీసీడీ వర్గీకరణ వల్ల దళితులు అందరికి న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2001లోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణ అమలు చేయగా, కోర్టులో కేసుల వల్ల ఇన్నాళ్ళకు తీర్పురావడం హర్షణీయమన్నారు. ర్యాలీలో ఎ.సుబ్బారావు, ఎస్.ఆస్కార్, ఎం.శామ్యూల్, వేణు, కిరణ్‌బాబు, తిరుపతిరావు, అనిల్, సొంగా రాజేష్, సొంగా విజయ, గంధం మోహన్‌రావు, మల్లయ్య, పలువురు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఎమ్మార్పీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల పోరాటం నేటికి ఫలిందన్నారు. దొండపాటి బాలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలకు ఎంతో మేలు జరుగుతుందని రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు.

● లింగపాలెం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ మాదిగ సోదరులకు ఇచ్చిన మాట నెరవేర్చే రోజు వచ్చిందని, ఈ తీర్పువల్ల మాదిగ ఉపకులాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో పల్లి శ్రీను, సొంగా సందీప్, ముక్తేశ్వరం, కలపాల సురేష్, చౌటపల్లి విజయ, సొంగా నక్షత్రం, మేరీ, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మాదిగ అమరవీరులకు అంకితమని రాష్ట్ర నేత విసంపల్లి సిద్దు మాదిగ అన్నారు. మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమం న్యాయమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జనసేన నేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బొడ్డపాటి పండు మాదిగ, రమేష్ మాదిగ, చేపలమడుగు రాంబాబు మాదిగలు ఉన్నారు.

కొత్త పాఠ్యపుస్తకాలపై టీచర్లకు పునశ్చరణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

ఏలూరు అర్బన్, ఆగస్టు1: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి 9, 10 తరగతులకు కొత్త సిలబస్‌తో ప్రవేశపెట్టిన పాఠ్య పుస్తకాలు, ప్రశ్నాపత్రాలపై సబ్జెక్టు టీచర్లకు పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా కామన్ పరీక్షల బోర్డు(డీసీఈబీ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే పునశ్చరణ తరగతులు గురువారం సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో ప్రారంభమయ్యాయి. పాఠ్యాంశాలను సులువుగా బోధించడంలో మెలకువలపై ఎస్.శివశంకర్, లక్షణకుమార్, నాగరాజు, అన్వర్‌భాషా, సురేష్, గిరిరాజ్, రాజబాబు, మురళీకృష్ణ, భీమయ్య, బెన్‌హర్, మల్లిఖార్జునరావు, దుర్గారావులు వ్యవహరించారు. తరగతుల నిర్వహణను కైకలూరు ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం కుటుంబరావు పర్యవేక్షించారు.

8న పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు

ఏలూరు రూరల్, ఆగస్టు 1: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు హెచ్ఎంలు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏలూరు రూరల్ మండలంలో ఈనెల 8న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో -2 రంగయ్య తెలిపారు. మండలంలో 29 జడ్పీ, 10 ఎంపీపీ పాఠశాలలు, 40 ప్రైమరీ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

● టి.నరసాపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న (ఎస్ఎంసీ) స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రామ్మూర్తి తెలిపారు. మండలంలో మొత్తం 60 పాఠశాలలు ఉన్నాయన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లను విద్యార్థుల తల్లిదండ్రులు ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారన్నారు. ఈనెల 5న ఆయా పాఠశాలల్లో ప్రదర్శించిన ఓటర్ లిస్టులో తప్పొప్పులు ఉంటే సవరించుకునే అవకాశం ఉంటుందన్నారు. 8న ఉదయం 7గంటల నుండి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

15 నుంచి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

ఏలూరు రూరల్, ఆగస్టు 1: చిరంజీవి యువత, ఏలూరు మెగా ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు శానం రామకృష్ణ గురువారం తెలిపారు. వారం రోజులపాటు నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.

శ్రీవారికి మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ద్వారకాతిరుమల, ఆగస్టు 1: చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గురువారం సందర్శించారు. అంతకు ముందు ఆయన తన తలనీలాలను స్వామివారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ బంగారు వాకిలి గుండా లోపలకి వెళ్లి స్వామి, అమ్మ వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖమండపంలో ఆయనకు ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు.



హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రవాణా, పోలీస్ సిబ్బంది

హెల్మెట్ ధారణతో వాహనదారులకు ప్రాణరక్షణ

ఏలూరు క్రైం, ఆగస్టు 1: హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చనని ఏలూరు అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌బాబు అన్నారు. రవాణాశాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు హెల్మెట్‌ధారణపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. జగదీష్‌బాబు మాట్లాడుతూ ఎదుటివారి అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల క్రమ పద్ధతిలో వెళ్ళేవారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. వాహనాలను అతి వేగంగా నడపకూడదని, ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఏలూరు త్రి టౌన్ సీఐ కె శ్రీనివాస్ హెల్మెట్ ధారణపై కలిగే లాభాలను వివరించి చెప్పారు.

క్రొవ్విడిలో ముస్లింల ఆత్మీయ సమావేశం

నిడమర్రు, ఆగస్టు 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. క్రొవ్విడిలో ముస్లింలు మహమ్మద్ మాజిద్, మహమ్మద్ సాజిద్ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్ఆర్ఐ మహమ్మద్ సాజిద్ తన వంతు కృషిగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటునివ్వాలన్నారు. క్రొవ్విడిలో అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని సాజిద్ ప్రకటించారు. టీడీపీ పశ్చిమ అధ్యక్షుడు రామరాజు, ముత్యాల స్వామి, వాకమూడి ఇంద్రకుమార్, సారికె లెనిన్‌బాబు, గఫార్‌ఖాన్, వంగా రఘు, కరణం పెద్దిరాజు, బాసిరాజు, వాసురాజు తదితరులు పాల్గొనారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కుక్కునూరు, ఆగస్టు1: జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. తమతో చదువుకున్న మాచర్ల కల్పనబాబు నాలుగేళ్ల క్రితం రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కుటుంబానికి మేమున్నాం అంటూ రూ.60వేలు సహాయాన్ని అందించడానికి ముందుకొచ్చారు. మృతునికి భార్య లక్ష్మీ, ముగ్గురు కుమార్తెలకు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. గురువారం విద్యార్థులంతా ఆ కుటుంబానికి డిపాజిట్ పత్రాలు అందజేశారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

లింగపాలెం, ఆగస్టు 1: ధర్మాజిగూడెంలో పేకాటరాయుళ్ళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట సమాచారం అందడంతో ఎస్సై చెన్నారావు వారిపై దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.



గుడివాకలంకలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద చింతమనేని నివాళి

సమస్యల పరిష్కారానికి చర్యలు : చింతమనేని

ఏలూరు రూరల్, ఆగస్టు 1: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. మీకోసం - మీచింతమనేని కార్యక్రమంలో భాగంగా గురువారం కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక గ్రామాల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. పలు గ్రామాల్లోని పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటివద్దకే వెళ్ళి పింఛన్లు అందజేశారు. గుడివాకలంకలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. విద్యుత్ లైన్ మరమ్మతులు, తాగునీటి సరఫరాలో సమస్యలు, రోడ్ల సమస్యలు చింతమనేని దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కె.డిపురంలో డ్రైన్‌లు, తమ బిల్లుల స్వార్థం కోసం నిరుపయోగంగా మార్చి వాటిని నాశనం చేసిన కాంట్రాక్టర్లు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తంబూరి నాగరాజు, నేతల రవి, పి.శేఖర్, బొంగు పాపారావు, సైజు సత్యనారాయణ, ఘంటసాల నాగరాజు, జయమంగళ దొరబాబు, ఎంపీడీవో బండి ప్రణవి, తహసీల్దార్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన గౌడ సంఘ నేతలు



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

దెందులూరు, ఆగస్టు 1: గౌడ సంఘస్తుల, సంక్షేమం, బలోపేతానికి మంత్రి అనగాని సత్య వరప్రసాద్ కృషి మరువలేదని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు చలమోలు అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం గుంటూరులో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గౌడ సంఘం రాష్ట్ర నేతలు కలిశారు. చలమోలు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీకారాం గోపాల్ గౌడ్ ఎన్నుకోవడం జరిగిందని మంత్రికి వివరించారు. రాష్ట్ర గౌడ సంఘం గౌరవ అధ్యక్షులుగా మంత్రి అనగాని సత్య వరప్రసాద్‌ను అశోక్ గౌడ్ ప్రకటించారు. అనంతరం మంత్రి సత్యవరప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రికి అశోక్‌గౌడ్ వివరించారు, పలువురు రాష్ట్రస్థాయి గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, ఆగస్టు 1: మండల కేంద్రంలో బస్ షెల్టర్ నిర్మిస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. నాల్గు రోడ్ల కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం తన సొంత ఖర్చుతో షెల్టర్ నిర్మిస్తామన్నారు. జీలుగుమిల్లి నుంచి పోలవరం, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మార్గాలకు ప్రధాన సెంటరు కావడంతో ఎక్స్‌ప్రెస్ స్టేజ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, చిర్రి శ్రీను, కోలా మధు, శాఖమూరి సాయి, అల్లం పండు, కక్కిరాల మురళీ, మాతంశెట్టి కిషోర్, కుమార్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** అశోక్‌నగర్ ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. జి.సూర్యనారాయణ ఉద్యోగ విరమణతో మూర్తిని నియమిస్తూ కళాశాల కరస్పాండెంట్ హరగోపాల్ లునాని ఉత్తర్వులు జారీ చేశారు.
- **కామవరపుకోట :** వీరిశెట్టిగూడెంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి సచివాలయ కార్యదర్శి బాలాజీ, వీఆర్వో ఆంజనేయులును పిలిచి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.
- **ఏలూరు అర్బన్ :** రావికంపాడు హైస్కూలులో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్కౌట్స్ విద్యార్థులకు స్కౌట్ స్కార్ఫ్‌లు అందచేశారు. స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు నిర్వహించారు.
- **బుట్టాయగూడెం :** ఏజెన్సీలో గిరిజనులు, పేదల పక్షాన పోరాటాలు చేసిన వ్యక్తి పాముల పాపదాసు అని సిపిఐ రాష్ట్ర నాయకుడు డేగా ప్రభాకర్ అన్నారు. గురువారం బుట్టాయగూడెంలో మండల కార్యదర్శి దారయ్య అధ్యక్షతన సిపిఐ సీనియర్ నాయకుడు పాముల పాపదాసు సంతాప సభలో నివాళులర్పించారు.
- **ఉంగుటూరు :** కాకర్లమూడిలో గోడే రాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని సర్పంచ్ కాళ్ల నాగ పండు ఆవేదన వ్యక్తం చేశారు.
- **లింగపాలెం :** ప్రగతిపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్నేళ్ళుగా ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవతో బస్సు సౌకర్యం వచ్చిందన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** వరద బాధితులకు జెట్టి గురునాథరావు వంట పాత్రలు అందచేశారు. ముప్పిడి శ్రీనివాసరావు, కుక్కల ధర్మరాజు, జడ్పీటీసీ గుజ్జ రామలక్ష్మి, ఎంపీపీ వల్లా దేవి, శ్రీనివాస్ గౌడ్, కామినేని వెంకటేశ్వరరావు, సత్తిరాజు, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.
- **చింతలపూడి :** నియోజకవర్గ కాపుసంక్షేమసంఘం అధ్యక్షులుగా చింతలపూడికి చెందిన చీదరాల మల్లికార్జున్‌రావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు నియామకపత్రం అందజేశారు.
- చింతలపూడి మండలం శంకుచక్రపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున పింగుల సూరన్నరాజు ఇల్లు కాలిపూర్తిగా దగ్ధమైంది. గ్యాస్‌లీక్‌వల్ల ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి తెలిపారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.
- **భీమడోలు :** సూరప్పగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తామని డీఈఈ నటరాజన్ తెలిపారు. భీమడోలు, సూరప్పగూడెం, పోలసానపల్లి, గుండుగొలను, లింగంపాడు, కోరుకల్లు, రత్నాపురం, భోగాపురం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాల లంక, చెట్టున్న పాడు, మల్లవరం గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత మహేష్



కలిదిండి, ఆగస్టు 1 : మంత్రి నారా లోకేశ్‌ను కొచ్చెర్లకు చెందిన టీడీపీ బీసీ సంఘ నాయకుడు కొమరపాలెపు వంశీ మహేశ్ కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపి రాష్ట్ర శాలివాహన (కుమ్మరి) కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పదవీ కోసం బయోడేటా అందజేశానని బయోడేటా చూసి పార్టీ మీకు అండగా ఉంటుందని, లోకేశ్ భరోసా ఇచ్చారని మహేశ్ తెలిపారు.

యువత మనస్సు బలంగా ఉండాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 1: యువత మనస్సు బలంగా ఉండాలని చిన్న చిన్న ఆటుపోట్లకు కుంగిపోకూడదని, ఆత్మహత్యలు అనే ఆలోచనలు రానివ్వ కూడాదని పలువురు వక్తలు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు గురువారం మైండ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దక్షిణ కొరియా నుంచి వచ్చిన ప్రతినిధులు కొరియన్ భాషను విద్యార్థులకు పరిచయం చేశారు. మైండ్ ఎడ్యుకేషన్‌పై అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్, కార్యదర్శి కె.సత్యనారాయణ, సభ్యులు యార్లగడ్డ రాజగోపాల్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

39 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నూజివీడు టౌన్, ఆగస్టు 1: నూజివీడు డివిజన్ పరిధిలో యావరేజ్‌గా 39 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లింగపాలెంలో 122.4 ఎంఎం అత్యల్పంగా నూజివీడు పట్టణంలో 18.4 ఎంఎం, చింతలపూడిలో 57.22 ఎంఎం, ముసునూరులో 36 ఎంఎం వర్షపాతం నమోదైంది. డివిజన్ వైజ్‌గా మొత్తం 234 ఎంఎం వర్షపాతం నమోదైంది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కైకలూరు ఆగస్టు 1: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహనతో ఉండి వాటిని నివారించాలని ఆచవరం సర్పంచ్ కట్టా నాగరాజగౌడ్ అన్నారు. ఆచవరంలో సీతనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పర్యవేక్షణలో దోమల మందు గురువారం పిచికారీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవా శిబిరం



న్యాయ సేవా శిబిరంలో మాట్లాడుతున్న జడ్జి

చాట్రాయి, ఆగస్టు 1: చిత్తపూరులో గురువారం ఉచిత న్యాయ సేవా శిబిరం, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. తిరువూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అట్లూరి సింధూర ప్రజలకు ఉచిత న్యాయం, మానవ హక్కులు గురించి అవగాహన కల్పించారు. సీనియర్ అడ్వకేట్లు అత్తులూరి శ్రీనివాస రావు, సత్యం, వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎస్సై స్వామి, మాజీ సర్పంచ్ చిట్టిబాబు, రామదాసు, ప్రజలు పాల్గొన్నారు.

తల్లి బిడ్డకు అందించే వరం ముర్రుపాలు



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న పద్మావతి

నూజివీడు టౌన్, ఆగస్టు 1: తల్లి బిడ్డకు అందించే మొదటి వరం ముర్రుపాలు అని ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి అన్నారు. సీఎంహెచ్‌లో గురువారం ఆమె తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లులకు విధిగా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు పూర్తి సహకారం అందించాలన్నారు. నూజివీడు సీడీపీవో నూరాణి, నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, ఏసీడీపీవో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌వార్డెన్‌గా హిమబిందు



వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హిమబిందు

ముసునూరు, ఆగస్టు 1: స్థానిక బాలికల వసతిగృహం వార్డెన్‌గా ఎ.హిమ బిందు గురువారం బాధ్యతలను స్వీకరించారు. నూజివీడు బాలికల హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్న వెంకట రమణ ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అవనిగడ్డకు చెందిన హిమబిందుకు ముసునూరు బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇవ్వడంతో నూజివీడు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు సమక్షంలో హిమబిందు బాధ్యతలను స్వీకరించారు. హిమబిందుకు హాస్టల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

4న ఉచిత వైద్య శిబిరం

ఆగిరిపల్లి, ఆగస్టు 1: అడవినెక్కలంలో ఈ నెల నాలుగో తేదీన విజయవాడ సుదీక్ష ఫౌండేషన్ ద్వారా ఎముకలు, కాళ్ళు, కీళ్ళు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ విమల తెలిపారు. పరీక్షలు ఉచితంగా చేస్తామని ఆమె తెలిపారు.

క్రైం సమాచారం

కుక్కల దాడిలో దూడలకు తీవ్ర గాయాలు



చాట్రాయి, ఆగస్టు 1: కృష్ణారావుపాలెంలో గొడ్డటి సులోచనరావు పశువుల దొడ్డిపై రెండు గేదె దూడలను కుక్కలు తీవ్రంగా గాయపర్చాయి. ఒక గెదె దూడ రెండు చెవులు, మరో గెదె దూడకు ఒక కాలు పూర్తిగా తినేశాయని సులోచనరావు తెలిపారు. కుక్కల మందలు మనుషులు, పశువులు, గొర్రెలు, మేకల దోడ్లపై దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను పట్టించి అడవులకు తరలించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మహిళా కానిస్టేబుల్‌ను వేధిస్తున్న అక్క భర్త

కైకలూరు, ఆగస్టు 1: సోషల్ మీడియా వేదికగా అక్క భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని ఓ మహిళా కానిస్టేబుల్ స్థానిక పోలీసులను ఆశ్రయించింది. గురువారం కైకలూరు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన మహిళా కానిస్టేబుల్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఓ పోలీసుస్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆమె అక్క భర్త అయిన అదే గ్రామానికి చెందిన సైదు స్వామీజి కుమార్ సోషల్ మీడియాలో మహిళా కానిస్టేబుల్‌ను తన భార్యగా చిత్రీకరించి ఫోటోలు పెట్టడమే గాక, అసభ్యకరమైన పోస్టులను పెట్టి వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్యదర్శితో అసభ్య ప్రవర్తన.. వీఆర్వోపై దాడి

మండవల్లి ఆగస్టు 1: ఉనికిలి సచివాలయ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శితో అసభ్యంగా ప్రవర్తించి, విధి నిర్వహణలో ఉన్న వీఆర్వోపై దాడి చేసి గాయపరిచిన సంఘటనపై మండవల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే బుధవారం మధ్యాహ్నం ఉనికిలి సచివాలయం కార్యాలయంలో పంచాయతీ చెరువుల వేలం వ్యవహారంలో ఉనికిలికి చెందిన కలవకుర్తి వెంకటరత్నం అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి సబ్బా వెంకట రాధికతో అసభ్యంగా ప్రవర్తించి దూషించాడు. ఆమె విధులకు ఆటంకం కలిగించారని, అదే తరుణంలో విధి నిర్వహణలో ఉన్న వీఆర్వో శ్రీనివాసరావు, వెంకటరత్నం ప్రవర్తనపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో వీఆర్వోపై దాడి చేసి గాయపరిచినట్లు కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్ బ్యాగులోని వస్తువులను సైతం వెంకటరత్నం ధ్వంసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు అసభ్యంగా ప్రవర్తించినందుకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మండవల్లి ఎస్సై రామచంద్రరావు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం నిందితుడి కైకలూరు కోర్టుకి హాజరుపరిచారు.

రైతుల కళ్లల్లో ఆనందం చూస్తాం

» చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం » మల్లవల్లి పారిశ్రామికవాడకు మళ్ళీ పూర్వ వైభవం » మంత్రి పార్థసారథి



కాట్రేనిపాడు సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ముసునూరు/నూజివీడు ఆగస్టు 1: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేసి నూజివీడు ప్రాంత రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్ళి లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి సారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వాటిలో ప్రధానమైన ఐదు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని, వాటిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా ఒకటన్నారు. పనులు ఈ రోజు నుంచే ప్రారంభిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మన రాష్ట్రాన్ని వీడి వెళ్ళి పోయిన పరిశ్రమలు సీఎం చంద్రబాబు చొరవతో మళ్ళీ మల్లవల్లిలో నెలకొల్పేందుకు యాజమాన్యాలు అంగీకరించాయన్నారు. దీంతో ఈ ప్రాంత యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. తమ ప్రభుత్వం హయాంలో ఇళ్ల మంజూరు చేసిన పేదలకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి పార్థసారథి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కర్ని గుర్తించి త్వరలో నూతన పింఛన్లు అందజేస్తామన్నారు. ఒక్కరోజులోనే 98 శాతం పింఛన్లు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. అన్న క్యాంటీన్‌లను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

సమస్యల వెల్లువ

పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి పార్థసారథి దృష్టికి సమస్యలు వెల్లువలా వచ్చాయి. కాట్రేనిపాడులో ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ తీగల సమస్యలు, వేంపాడు మేజర్ నుంచి కాట్రేనిపాడు గ్రామానికి వచ్చే ఎన్ఎస్‌పీ కాలువ తవ్వకంలో రైతుకి తగిన నష్టపరిహారం అందలేదని, అడ్డుపడటంతో కాలువ నిర్మాణం ఆగిపోయిందని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు మంత్రి ఆదేశించడంతో పాటు రైతుతో మాట్లాడి ఎన్ఎస్‌పీ కాలువ నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఇంకా పలువురు తమ సమస్యలను మంత్రికి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. మండల వ్యాప్తంగా ఉన్న డ్రైనేజీ, అంతర్గత రహదారుల సమస్యను త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, సర్పంచ్‌లు గద్దల సుహాసిని మోహన్‌రావు, కంచర్ల వాణి, ఎంపీటీసీలు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ యమిలి కుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి, ఎంపీడీవో పద్మావతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సత్యప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారం

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కలిదిండి, ఆగస్టు 1 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

5న మండల పరిషత్ సమావేశ మందిరం ప్రారంభం

కైకలూరు ఆగస్టు 1: కైకలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు మందిరాన్ని ఈ నెల 5న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించనున్నట్లు ఎండీవో ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఎంపీపీ అడవి వెంకటకృష్ణ మోహన్ అధ్యక్షతన సమావేశపు మందిరాన్ని ప్రారంభించి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

ఎస్ఎంసీ కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్

చాట్రాయి, ఆగస్టు 1: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసి, ఓటర్ల జాబితాలను నోటీస్ బోర్డులలో ప్రదర్శించారు. 5న ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి, తుది ఓటర్ల జాబితాలు ప్రచురిస్తారు. 8న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, అనంతరం ప్రమాణ స్వీకారం, ఎస్ఎంసీ తొలి సమావేశం జరుగుతుందని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు.

● ముదినేపలి : ఈ నెల 8న జరుగనున్న ప్రభుత్వ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల్లో ఓటు హక్కుకు అర్హత కలిగిన తల్లిదండ్రులు జాబితాలను హెచ్ఎంలు ప్రకటించారు. ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 11 యూపీ పాఠశాలలు, 48 ఎలిమెంటరీ పాఠశాలల మేనేజింగ్ కమిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 8న ఎన్నికలు జరుగుతాయి.



కోరుకొల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ రామారావు



ముదినేపల్లి మండలం పెదపారుపర్రులో పింఛను పంపిణీ చేస్తున్న చల్లగుళ్ల







చనుబండలో, కైకలూరులో, రమణక్కపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

పింఛన్ల పంపిణీ

కలిదిండి, ఆగస్టు 1 : మండలంలో గురువారం సాయంత్రం ఆరు గంటలకు 96 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ సిబ్బందితో కలసి కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, కూటమి నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. కోరుకొల్లులో మాజీ ఎంపీపీ వలవల రామారావు, జనసేన నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 23 పంచాయతీల్లో తొలి రోజు 96 శాతం పింఛన్లు పంపిణీ చేయడంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● కైకలూరు : వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు ఎండీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. కూటమి నాయకులు మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాదరాజు, పోలవరపు లక్ష్మీరాణి, మాజీ వైస్ ఎంపీపీ ఎంఏ రహీం, కేకే బాబు, ఎస్సీసెల్ నాయకులు వీరాబత్తిన సుధా, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, బాజానీ, జోకల శ్రీనివాసరావు, తోట లక్ష్మీ, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● చాట్రాయి : మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో మంగాకుమారి తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి టీడీపీ జనసేన బీజేపీ నాయకులు సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పింఛన్లు అందజేశారు. చనుబండలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ప్రదీప్ కుమార్, కందుల కృష్ణ, బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు, జనార్దనవరంలో తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ, చాట్రాయిలో ఐటీడీపీ నాయకుడు ఎలికా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో పెన్షన్ సొమ్మును అందజేస్తున్న నేతలు

● ముదినేపల్లి : మండలంలో పింఛన్ల పంపిణీ 97 శాతం పూర్తయింది. మొత్తంగా 9,022 మందికి రూ.3.82 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సాయంత్రానికి 8,752 మందికి రూ.3.71 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధర్‌రావు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, తెలుగు రైతు నాయకులు చలసాని జగన్మోహనరావు, బొప్పన సుందర రామయ్య, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు అడుసుమిల్లి రామకృష్ణ, ఈడ్పుగంటి శ్రీనివాస్, బొంగు రవికుమార్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పింఛన్లుపంపిణీ చేశారు.

● మండవల్లి : కూటమి నాయకులతో కలిసి అధికారులు ఆయా గ్రామాల్లో పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండవల్లి మండలం భైరవపట్నంలో ఎండీవో బేబీ శ్రీలక్ష్మీ పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు నారగాని నాగేశ్వరావు, ముళ్లపుడి సత్తిబాబు, ముదినేపల్లి మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : మండలంలో 9,771 లబ్ధిదారులకు 9,458 మందికి పింఛన్లు పంపిణీ చేశామని (97 శాతం) ఎండీవో శామ్యూల్ తెలిపారు. పింఛనుదారులలో కొంతమంది మరణించి, కొంతమంది గ్రామాల్లో లేకపోవడం వల్ల మిగతా మూడు శాతం పూర్తి అవ్వలేదని శుక్రవారం ఉదయం 10 గంటల్లోపు మొత్తం పూర్తిచేస్తామని తెలిపారు.

● ముసునూర : మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచే అధికారులు, కూటమి నాయకులు లబ్ధిదారులకు పింఛన్ల నగదును ఇంటి వద్దనే అందజేశారని తెలిపారు. రమణక్కపేటలో టీడీపీ నాయకులు రంగు శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబు, కార్యదర్శి ప్రసాద్ పింఛన్లు అందజేశారు.

రేషన్‌దుకాణంలో జేసీ తనిఖీలు



ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ముసునూరు, ఆగస్టు 1:మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలోని రేషన్ దుకాణాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ పాస్ మిషన్ లో స్టాక్ రిపోర్ట్, దుకాణంలో ఉన్న స్టాక్‌ను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. దుకాణం చుట్టుపక్కల వారితో జేసీ మాట్లాడారు. రేషన్ బియ్యం, సరుకులు సక్రమంగా అందుతున్నాయా? బియ్యం నాణ్యంగా ఉంటున్నాయా? లేదా? అన్ని సరుకులు ఇస్తున్నారా? తదితర వాటి గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజా పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్దేశించిన సమయానికి అన్ని సరుకులను సకాలంలో లబ్ధిదారులకు అందచేయాలని రేషన్‌డీలర్ నాగరాజు, ఎండీయూ మహేష్‌లకు ఆమె సూచించారు.

రికార్డుల పరిరక్షణకు తగుచర్యలు తీసుకోండి

ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డుల పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి, అధికారులను ఆదేశించారు. ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుల గది, తమ కార్యాలయ ఆవరణను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కార్యాలయ రికార్డుల భద్రతను పరిరక్షించేందుకు 24 గంటల పాటు సిబ్బందికి షిప్టుల వారీగా విధులు కేటాయించాలని ఆదేశించారు. అనంతరం ముసునూరులో రేషన్ దుకాణాన్ని ఆమె ఆకస్మిక తనిఖీచేసి రేషన్ పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాల శాఖ డీటీ జీవీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలికుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రూ.18 కోట్లతో మామిడి మార్కెట్



మార్కెటింగ్ యార్డు ఏర్పాటు గురించి అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, ఆగస్టు 1: రాబోయే మామిడిసీజన్‌కి నూజివీడు మార్కెట్ యార్డులో సకల మౌలిక సదుపాయాలతో మామిడి మార్కెట్‌ను రూ.18 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి, కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారులతో సమావేశమై మామిడి మార్కెట్ ఏర్పాటు ప్లాన్‌ఆఫ్ యాక్షన్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మామిడి మార్కెట్‌ను నూజివీడు అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డుకు అనుసంధానం చేస్తున్నామన్నారు. రూ.18 కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించామన్నారు. 41 వేల మీటర్ల సువిశాలమైన మార్కెట్ యార్డులో రెండు షెడ్లు, మామిడి రైతుల సదుపాయాల కోసం 70 దుకాణాలు, లారీ కాటా, సీసీ రోడు వంటి సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మామిడి మార్కెట్ వల్ల స్థానిక రైతులు ఆర్థికంగా మెరుగుపడతారన్నారు. తద్వారా నూజివీడు పట్టణం, పరిసర ప్రాంత వాసులకు కూడా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఎంతోమంది లేబర్‌కు కూడా ఉపాధి దొరుకుతుందన్నారు. రైతుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయిస్తామని తెలిపారు. ఇప్పటివరకు నున్న మార్కెట్‌కు మామిడి పంటను తీసుకుని వెళ్ళే రైతులు, ట్రేడర్స్ వచ్చేసీజన్ నుంచి నూజివీడు యార్డుకు మామిడి పంటను తరలించి ఇక్కడే కొనుగోలు అమ్మకాలు జరపాలన్నారు. మామిడి మార్కెటింగ్ యార్డు ఏర్పడిన తరువాత మరిన్ని గ్రాంట్లు తెచ్చి మరింత అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు.నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, మార్కెటింగ్ సెక్రటరి మహాలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ మల్లేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, ట్రేడర్స్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి మోహరున్నీసా



కూతురు, అత్తతో మోహరున్నీసా

ఆగిరిపల్లి, ఆగస్టు 1: పొట్ట కూటి కోసం ఏజెంట్లను నమ్మి విదేశాలకు వెళ్తే తనను చిత్రహింసలకు గురి చేశారని మంగళవారం ప్రభుత్వ కృషితో స్వగ్రామానికి వచ్చిన మొహర్నీసా తెలిపారు. పసి పిల్లలను చూసుకునే పని అని చెబితే తన పిల్లలను అత్త సలీమున్నాసా వద్ద వదిలి తన భర్త జుబేర్ పని చేస్తున్న సౌదీలోని రియాద్ నగరానికి బయలు దేరానని కానీ ఏజెంట్ మోసం చేసి మస్కట్ పంపాడన్నారు. ఏజెంట్ చెప్పిన చోట అసలు పసిపిల్లలు లేరన్నారు. ఎక్కడో అక్కడ పని దొరికింది కదా అని వెళితే మస్కట్లో యజమానులు ఫోన్ లాక్కుని చిత్రహింసలకు గురి చేశారని, కనీసం తిండి పెట్టేవారు కాదని నీరు కూడా ఇచ్చేవారు కాదని వాపోయారు. అనుకోకుండా దొరికిన ఫోన్‌లో తన భర్తకు విషయం తెలపగా, తాను సౌదీలో అష్టకష్టాలు పడుతున్నానని తన యజమానులు కొడితే పారిపోయి బయట తెలిసిన వారి వద్ద ఉంటున్నానని తెలిపి ఈ మొత్తం వ్యవహారాన్ని తన భర్త సామాజిక మాధ్యమంలో పెట్టాడన్నారు. అది చూసిన తల్లి సలీముని మంత్రి లోకేశ్‌ను కలువగా తమను ఇండియాకు తీసుకువస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మూడు రోజుల క్రితం మరలా విజయవాడ తెలుగుదేశం మహిళ నాయకురాలు సొంటి ఈశ్వరి ద్వారా బొండా ఉమాకు తెలియచేయగా, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మంగళవారం రాత్రి విజయవాడకు చేరుకున్నానని తెలిపారు. ఇల్లు తాకట్టు పెట్టి రూ.రెండు లక్షలు ఏజెంట్‌కు ఇచ్చానని చెప్పారు. తన భర్తను కూడా ఇండియాకు తీసుకురావాలని మోహరున్నీసా వేడుకున్నారు.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక నాయ్యం



పిన్నరెడ్డిపల్లిలో సంబరాల్లో టీడీపీ ఎస్సీ నాయకులు

ఆగిరిపల్లి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ అనేది సామాజిక న్యాయమని, అట్టడుగున ఉన్న 59 కులాలకు న్యాయం చేయటమే ఏబీసీడీ వర్గీకరణ అని ఆగిరిపల్లి ఎమ్మార్పీఎస్ నాయకుడు మంగలపూడి నాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు, మందకృష్ణ మాదిగ కృషి ఫలితంగా ఈ రోజున వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కొంతమంది నాయకులు చంద్రబాబు 2000 సంవత్సరంలో తెచ్చిన వర్గీకరణ ఆర్డినెన్స్‌ను 2005 నవంబర్ 3న వర్గీకరణ చెల్లదని రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణను ఆపిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆడిన రాజకీయ చదరంగంలో అనేకమంది మాదిగలు ప్రాణ త్యాగం చేశారన్నారు. రిజర్వేషన్ ఫలితాలు మాల సామాజిక వర్గం ఎక్కువ అనుభవించిందని ఇప్పుడు ఈ తీర్పుతో 59 కులాలకు సమానంగా న్యాయం జరుగుతుందని 30 సంవత్సరాల మంద కృష్ణమాదిగ కృషి ఫలించిందన్నారు. 59 కులాలకు వారివారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అనుభవిస్తారని పేర్కొన్నారు పిన్నమరెడ్డిపల్లిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జిల్లా ఎస్సీసెల్ నాయకులు జన్ని రాంబాబు, యలమర్తి భవానీశంకర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు, నల్లమోతు బాబ్జీ, బొడ్డు ఆనంద, బొడ్డు రాంబాబు, యలమర్తి దాసు, కుంపటి శ్యాంబాబు, కుంపటి నవీన్, నల్లమోతు దావీదు, జన్ని సిద్ధు, చోడవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● చాట్రాయి : ఎస్సీ వర్గీకరణ అమలుకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో చాట్రాయిలో కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పోలవరం, చిత్తపూరు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కృష్ణమాదిగ నాయకత్వంలో సుదీర్ఘంగా జరిగిన పోరాటం ఫలించటంతో మాదిగజాతి జీవితాల్లో కొత్తవెలుగులు వస్తామన్నారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు తెచ్చిన వర్గీకరణ చట్టమే సుప్రీం కోర్టు తీర్పుకు ప్రాతిపదిక అని కొనియాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గార్లపాటి మారేష్, మల్లుపాటి రవిరామ్, బిలుగది జయరాజు, ముల్లంగి ప్రభాకర్, తిరువీధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లపాలెం డాక్టర్‌కు ఘన నివాళి



కాళ్లపాలెం డాక్టర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

కైకలూరు, ఆగష్టు 1: పేదలకు అనేకరకాల వైద్య సేవలందించిన మహోన్న తమైన వ్యక్తి కాళ్ళ పాలెం డాక్టర్ బి.నరసింహారావు నాల్గొవ వర్ధంతి సందర్భంగా అగ్రహారం లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజలు నివాళులర్పించారు. చిల్లిముంత నాగరాజు (రాజా), చిల్లిముంత గణపతి, మారగాని గణపతి, బత్తిన సత్యనారాయణ, చిల్లిముంత వెంకట మోహనరావు, నాగేశ్వరరావు, పెదసోమయ్య, దుసనబోయిన నాంచారయ్య వేంపాటి రామలింగశాస్త్రీ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

కైకలూరు ఆగష్టు 1: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే చట్టరీత్యా నేరం అవుతుం దని కైకలూరు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ తెలి పారు. కైకలూరు రూరల్ స్టేషన్ పరిధిలో వదర్లపాడు బ్రాంచి సెంటర్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు నెంబర్ ప్లేట్లు లేకుండా నడిపేవారిని గుర్తించి తక్షణమే నెంబర్ ప్లేటు వేయాల ని అలాగే హెల్మట్లు ధరించాలని కౌన్సిలింగ్ ఇచ్చారు.

పందులు, కోతులతో ప్రజల పాట్లు



ముదినేపల్లి అంబేడ్కర్ నగర్‌లో కోతుల స్వైర విహారం

ముదినేపల్లి, ఆగస్టు 1 : మండల కేంద్రమైన ముదినేపల్లి పందులు, కోతుల సంచారానికి ఆలవాలంగా తయారయింది. ఒక్క పందులు, మరో పక్క కోతుల స్వైర విహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మురుగు గుంటల్లో దొర్లాడిన పందులు ఇళ్ల వద్దకు వచ్చి అసహ్యాకర పరిస్థితిని సృష్టిస్తున్నాయి. పందుల సంచారాన్ని నివారించడంలో గ్రామ పంచాయతీ ఫలితం సాధించలేకపోతుంది. పందుల పెంపకాలను గ్రామానికి దూరంగా నిర్వహించాలని అధికారులు పెంపకందారులకు చెప్పినా వారు లెక్క చేయడం లేదు. పంచాయతీలు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. పందుల వల్ల అంటువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో పక్క అంబేడ్కర్ నగర్‌లో కోతుల బెడద ఎక్కువైంది. మమ్మల్ని ఆపేదె వడురా అన్న చందంగా వీధి బజారులో తిష్ట వేసుకు కూర్చొంటున్నాయి. గృహాల్లోకి ప్రవేశించి తినుబండారాలను ఎత్తుకుపోతున్నాయని పలువురు వాపోతున్నారు. తరుముతుంటే ఎదురు తిరిగి మీద పడుతున్నాయి. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పందులు, కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.